నేటి నుంచి అండర్-14 క్రికెట్ టోర్నమెంట్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో నీవి చారిటబుల్ ట్రస్ట్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి ప్రారంభమవుతాయని సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ అండర్-14 పోటీలను ఉదయం 10గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రేపు 'తిరంగా ర్యాలీ'

నల్లకుంట: పహల్గాం ఉగ్రమూకల దాడి అనంతరం పాకిస్తాన్ ముష్కర మూకల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో ఈనెల 17న సైనికుల గౌరవార్థం 'తిరంగా ర్యాలీ'చేపడుతున్నామని శబరిమల అయ్యప్ప సేవా సమాజం (ఎస్ఏఎస్ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భారత వీర సైనికుల శక్తి సామర్థ్యాలను మననం చేసుకుంటూ ఆ రోజు సాయంత్రం 5గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని అన్నారు.

25న ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్‌షిప్ టెస్టు

కాచిగూడ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (ఎన్ఐఎఫ్‌డీ, హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల డిగ్రీ, డిప్లమో, ఒకేషనల్ కోర్సులలో చేరడానికి స్కాలర్‌షిప్ టెస్టును ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ రంగాన్ని కెరియర్‌గా ఎంచుకోవాలనుకున్న విద్యార్థులకు ఎన్ఐఎఫ్‌డీ సంస్థ ప్రతి సంవత్సరం మాదిరిగా 2025-26 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన విద్యార్థినులు, మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పీసీసీని, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉందని అలాంటి కాంగ్రెస్ నేడు బీఆర్ఎస్‌ను విమర్శించడం తగదని బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేత హరీష్‌రావు బయటకు వెళ్తారని.. పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజల్ని మభ్యపెట్టి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని.. సొంత ఇంటిని చక్కదిద్దుకోలేని కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై లేనిపోని ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు.

ఫీజుల పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల ఫీజుల పెంపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోటా రమేష్, అనగంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు పెద్ద మొత్తంలో ఫీజులు పెంచుకునేందుకు టీఏఎఫ్ఆర్సీకి పంపిన ప్రతిపాదినను విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రతిఏటా లక్షల్లో ఫీజులు పెంచుతూ తల్లి దండ్రులపై ఆర్థికభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డివిజన్‌లో పైపులైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నాం

ముషీరాబాద్: బాపూజీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. గురువారం సద్గురు టెంట్‌హౌస్ వద్ద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న క్రమంలో స్థానికులు తాము ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె సొంత డబ్బులతో డ్రైనేజీ పైపులు తెప్పించి వేయించారు. అనంతరం రోడ్డు పనులు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో అధ్వానంగా మారిన డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌లను ఆధునీకరించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు రాజు, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు సిద్ధం

చాదర్‌ఘాట్: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు సిద్ధం చేశామని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు అన్ని మాధ్యమాల్లో పుస్తకాలు సిద్ధం చేశామని అధునాతనమైన మిషన్లతో పుస్తకాల ముద్రణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల సంబంధిత అధికారులకు పుస్తకాలు అందజేస్తామన్నారు. పాఠ్య పుస్తకాలు కావాల్సిన వారు మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయానికి వచ్చి మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

సత్ఫలితాలిస్తున్నాయ్.!

ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో భారీ వరదనీటి సంప్ నిర్మాణం

• వరద నీటిని నాలుగు గంటల్లోనే ఖాళీ చేస్తున్న మోటార్లు • మరిన్ని చోట్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు



రాజ్‌భవన్ రోడ్డు లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు నిర్మించిన రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్

బంజారాహిల్స్: భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై వరదనీరు నిలవకుండా నిర్మించిన రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మొదటి ఫేజ్ కింద జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తి చేసుకోగా, రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌తో పాటు సోమాజీగూడ ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో, సచివాలయం సమీపంలో వీటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే గత మార్చి 3వ తేదీ నుంచి ఇప్పటివరకు పలుమార్లు కురిసిన భారీ వర్షాలకు గతంలో ఉన్నంత వరద తీవ్రత కనిపించడం లేదు. గత మార్చి 3న మూడు గంటల్లోనే 9 సెంటీమీటర్ల వర్షం కురవగా, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు రెండు చోట్ల నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ వద్ద వరదనీరు ఎప్పటికప్పుడు సంప్‌ల్లోకి చేరుకుంది. రాజ్‌భవన్ రోడ్డులో గతంలో 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే ట్రాఫిక్ స్తంభించిపోయి రాకపోకలు నిలిచిపోయేవి. కానీ మార్చి 3న 9 సెంటీమీటర్ల వర్షపాతం దాటినా పెద్దగా ఇబ్బంది కలగలేదు.

ఆర్టీఏ ఆవరణలో మరో సంప్ నిర్మాణం..

- ఈ వరదనీటి సంప్‌ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు.
- ఈ హోల్డింగ్ స్ట్రక్చర్లను 10 లక్షల లీటర్ల నీటిని స్టోర్ చేసుకునేలా నిర్మించారు. భారీ వరదలకు 10 లక్షల లీటర్ల నీటిని ఈ సంప్‌లు తీసుకోగలుగుతున్నాయి.
- ఒకవేళ వీటిని నిర్మించకుంటే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగి ఉండేవి. ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసు వద్ద కూడా చిన్నపాటి వర్షానికి నడుము లోతు నీరు నిలిచిపోయేది.
- ఇక్కడ కూడా భారీ సంప్ నిర్మాణంతో సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు వీటికి అదనంగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో కూడా 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉండే సంప్‌ను నిర్మిస్తున్నారు.
- మెర్క్యూరీ హోటల్ ముందు నిర్మించిన సంప్‌లో వరదనీరు నిలవగానే నేరుగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న సంప్‌లోకి మళ్లిస్తారు. దీంతో ఒక్క చుక్క కూడా నీరు నిలవకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌లో సుమారు 10 లక్షల లీటర్ల నీరు స్టోరేజ్ చేయడానికి అవకాశం ఉంటుంది.
- ఈ స్ట్రక్చర్స్‌లో వరద నిండిన వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ వీటి దగ్గర 25 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న మీటర్లను బిగించింది.
- సంప్ నిండగానే నాలుగు గంటల్లోనే ఈ నీళ్లను ఖాళీ చేస్తున్నారు.
- మరిన్ని చోట్ల రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.
- రెండో దశలో వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీని కోసం వాటర్ లాగింగ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, సోమాజీగూడ, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో కూడా వరదనీటి సంపుల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నియోజకవర్గ రోడ్ల సమగ్ర అభివృద్ధికి కృషి



సాయిమధురానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్‌లో రూ.38 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో రోడ్ల మరమ్మతులతో పాటు కొత్త రోడ్లు వేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే రోడ్లతో పాటు పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించామని అన్నారు. పార్కులు అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు బీ.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్, జమ్మిశెట్టి బాలరాజ్, కోట్ల సంతోష్, రమేష్ నాయక్‌తో పాటు కాలనీవాసులు ఉన్నారు.

జనహితం 'మాచన' అభిమతం

పొగాకు నియంత్రణపై రాష్ట్రపతి భవన్ స్పందన

కాచిగూడ: జన హితం కోరుతూ.. పొగాకు నియంత్రణ ఆవశ్యకతను వివరిస్తూ.. ఓ అధికారి రాసిన మానవీయ లేఖకు రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలియజేస్తూ.. గురువారం రాష్ట్రపతికి ప్రత్యుత్తరం పంపినట్లు పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏళ్లుగా.. చేస్తున్న పొగాకు నియంత్రణకు అసాధారణ కృషిని మే 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు నియంత్రణ ఆవశ్యకతను వివరిస్తూ రాష్ట్రపతికి లేఖ రాసినట్లు వివరించారు. గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాన్ని నిషేధించాల్సిన అవసరం ఉందంటూ ఈ మెయిల్ చేశానన్నారు. గురువారం 42 పేజీల నివేదికను పోస్టు ద్వారా పంపానని మాచన రఘునందన్ చెప్పారు.

పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలి



అశోక్‌నగర్ ధోబీఘాట్ వద్ద పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ నాలాలో పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అధికారులను ఆదేశించారు. ప్రతి వర్షాకాలంలో నాలాలో వరద పెరిగి నాలా పరివాహక ప్రాంతాలైన సుభాష్‌చంద్రబోస్ నగర్, అంబేడ్కర్ నగర్, సూరజ్ నగర్ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటారని ఆమె పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని ధోబీఘాట్ వద్ద పూడికతీత పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాలా పూడికతీత తీసిన వెంటనే తరలించాలన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు, శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్, చిత్రకుమార్‌గౌడ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలి



లింగంపల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి గురువారం అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. లింగంపల్లిలో చేపట్టిన పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పైపులైన్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్, జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు బల్వీర్, శేర్‌సాగర్, నర్సింగ్‌రావు, ఎస్.అరవింద్, బి.భీమ్‌రాజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం దొరకడం లేదని యువకుడు ఆత్మహత్య

అంబర్‌పేట: సరైన ఉద్యోగం, ఉపాధి లభించడం లేదని మానసిక ఒత్తిడికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక ఇందిరానగర్‌కు మహ్మద్ మన్సూర్ కుమారుడు మహ్మద్ కబీర్(24) సరైన ఉద్యోగం లభించడం లేదని మానసికంగా కుంగిపోతున్నాడు. కాగా గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సమయం తరువాత అతని కుటుంబ సభ్యులు గది తలుపుతట్టగా రాకపోవడంతో ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తలుపులన పగలగొట్టి చూసేసరికి అతను ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు ముందు తనకు సరైన ఉద్యోగం రావడం లేదని.. తన చావుకు ఎవ్వరు కారణం కాదని సెల్‌ఫోన్‌లో వీడియో తీసి పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... నగర శివారు ప్రాంతం చెంగిచెర్లకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి రాజశేఖర్ బుధవారం బెంగళూర్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నాడు. రైలు మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద ఉండగా చూసుకోగా ల్యాప్‌టాప్, పాన్, ఆధార్, డెబిట్, క్రెడిట్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, రూ.వెయ్యి నగదు ఉన్న బ్యాగు కన్పించలేదు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసును నమోదు చేశారు.

బైక్ దొంగ అరెస్ట్.. ఏడు బైక్‌లు స్వాధీనం

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీసులు ద్విచక్రవాహనాల దొంగను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 7 వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం మీడియా సమావేశంలో ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, డీఐ శంకర్ వివరాలను వెల్లడించారు. సురేష్‌బాబు అనే వ్యక్తి డిసెంబరు 7వ తేదీన తన స్నేహితుడిని తన కార్యాలయంలో కలవడానికి వెళ్లి యాక్టివా (టీఎస్09ఈఎల్4174) గల తన ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని నివేదిత హాస్పిటల్ లేన్‌లో పార్క్ చేశాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనపడలేదు. దీంతో చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు మంతెన కృష్ణంరాజును అరెస్టు చేశారు. ఆ తర్వాత నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడిని జ్యూడిషియల్ కస్టడీకి పంపించారు. నగర పరిధిలో 12 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు.

టీచర్ పోస్టులకు డీఎస్సీ ప్రకటించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సంతోష్‌కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు వెంటనే డీఎస్సీ ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అధ్యక్షతన గురువారం బీసీ టీచర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రోస్టర్ కం మెరిట్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి బాకీ ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ 50శాతం, హెల్త్ కార్డులను కొత్తగా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బీసీ టీచర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బి.సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా ఆర్.లక్ష్మీకాంతారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



బాలోత్సవం ముగింపు సభలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అప్పుడే అది తమ ఎదుగుదలకు దోహదపడుతుందని ప్రొఫెసర్ చంద్రయ్య అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జరిగిన రెసిడెన్షియల్ విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రొ. చంద్రయ్య మాట్లాడుతూ... సాంస్కృతిక రంగం ద్వారా కూడా సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని అన్నారు. బాలోత్సవ అధ్యక్ష , కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలతో పాటు ఫన్ మ్యాథ్స్, మూఢ నమ్మకాలపై అవగాహన, దేశం కోసం త్యాగం చేసిన 18 మంది గొప్ప నాయకుల గురించి తెలిపామన్నారు. అనంతరం ప్రతిభగల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త అంకమ్మ, బుచ్చిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వీయ రక్షణకు కరాటే దోహదం

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



కరాటే విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: మహిళల స్వీయ రక్షణకు కరాటే ఎంతో దోహద పడుతుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అక్కా చెల్లెళ్లు అమృతరెడ్డి, సంతోషి జిరెడ్డిల వరల్డ్ రికార్డ్ పోస్టర్‌ను గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. కరాటే నేర్చుకునేలా పిల్లల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డా. జీఎస్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన కాచిగూడలోని కరాటే అకాడమీలో అక్కాచెల్లెళ్లు 6వ సారి ప్రపంచ రికార్డు ప్రదర్శనను నిర్వహించనున్నారని తెలిపారు. 11 విభాగాల్లో 121 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను కేవలం 11 నిమిషాల్లో ఇద్దరు ప్రదర్శించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర బీజేపీ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ముషీరాబాద్: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో గురువారం కార్మికుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ... కనీస వేతనాలు రూ.26వేలకు పెంచి అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సురెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మే 20న నిర్వహించిన సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అనురాధ, అరుణ, పి.శివ, బాబు, జిల్లా నాయకులు మణెమ్మ, రామ్‌రెడ్డి, మధుకర్, దూలప్ప తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, పుణ్యాహవనం, బిందేతీర్థం, బలిహరణం, బాలభోగం, మంత్రపుష్పం, వేదపారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహనివేదన, తీర్థ ప్రసాద వితరణలు జరిగాయి. సాయంత్రం నిర్వహించిన గజవాహన సేవ భక్తులను ఆకట్టుకుంది.

చిక్కా దేవదాసుకు ప్రజ్ఞా ప్రపూర్ణ బిరుదు



చిక్కడపల్లి: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి సుంకర సత్యనారాయణ అన్నారు. గురువారం త్యాగరాయ గానసభలో ఆధ్యాత్మికవేత్త చిక్కా దేవదాసుకు 'ప్రజ్ఞా ప్రపూర్ణ బిరుదు'ను ఆయన ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చిక్కా దేవదాసు పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంఘం సేవా సంస్థ కళానిలయం, ఆధ్యాత్మిక సంస్థ ఓంకార సత్సంగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, చిక్కా శంకర్, సురేష్‌గుప్తా పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ



అంబర్‌పేట: దేశం కోసం యుద్ధభూమిలో మరణించిన వీర జవానులకు నివాళులర్పిస్తూ గురువారం అంబర్‌పేటలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. భారత జవానులు సరైన రీతిలో పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించారని అన్నారు. దేశ పౌరులను కాపాడుతూ మరోసారి జాతీయ జెండాను రెపరెపలాడిస్తూ దేశం గర్వించే విధంగా జవానులకు సెల్యూట్ చేస్తూ జై జవాన్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది. అంబర్‌పేట చే నంబర్ నుంచి కాచిగూడ కృష్ణానగర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్లు వై.అమృత, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, రవీందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, సునీల్, రాజేష్, ఈశ్వర్, వెంకటేష్, భూషణం చారి, అజయ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.